క్లుప్తంగా

గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె. రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో మంగళవారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ సమన్వయకర్త కె.కె. రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి కె.కె. రాజు వినతులు స్వీకరించి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. మరి కొన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మద్రిపాలెం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారిపై విశాఖ డెయిరీ పాల లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా.. సోమవారం రాత్రి సుమారు 10.30 గంటల ప్రాంతంలో ఎన్‌ఏడీ నుంచి మద్దిలపాలెం వైపు వెళ్తున్న విశాఖ డెయిరీ పాలలారీ తాటిచెట్లపాలెం జాతీయ రహదారి వద్ద సుమారు 30–40 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మంగళవారం కంచరపాలెం వీఆర్వో బాబూలాల్ ఫిర్యాదు మేరకు ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎన్. సాయి నేతృత్వంలో ఎస్ఐ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు. సదరు మృతుడు 5 అడుగుల పొడవు, నలుపు రంగులో ఉన్నారని, అతని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరచామని, ఆచూకీ తెలిసిన వారు కంచరపాలెం పోలీసులను సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

మద్రిపాలెం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన 51వ వార్డు మాధవధారలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా దోమలు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, దోమల నివారణకు ప్రజలు స్వచ్ఛందంగా సమీపంలోని పరిసరాల్లో నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

మర్యాద పూర్వక కలయిక



కోలాగురువులును సత్కరిస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

మద్రిపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులను మంగళవారం 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కొండవాలు ప్రాంతాల పరిశీలన



జేసీ విశ్వనాథన్‌తో కలిసి పర్యటిస్తున్న కె.కె. రాజు

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు సత్యనగర్, సాయిరాంనగర్ కొండవాలు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌తో కలిసి ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె. రాజు పర్యటించారు. గత 15 సంవత్సరాల పైబడి ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాల్లో నివాస గృహాలు నిర్మించుకుని ఉంటున్న పేద ప్రజలకు ఇళ్లపట్టాలు మంజూరు చేసే విషయమై ప్రభుత్వం పరిశీలిస్తున్న నేపథ్యంలో ఈ పర్యటన చేట్టారు. ఆర్‌డీవో హుస్సేన్, ఎమ్మార్వో జయ, డైరెక్టర్ పైడి శ్రీను, సబ్బవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ట్రా'ఫికర్'

ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిపై ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ట్రాఫిక్, జీవీఎంసీ జోన్–5 అధికారులు, సచివాలయం, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వాహన చోదకులు, వ్యాపారుల్లో ఇసుమంత మార్పు కూడా రావటంలేదు. ప్రధాన, అంతర్గ రహదారులపై భారీ లారీలు, ట్రావెల్ సంస్థలకు చెందిన బస్సులను పార్కింగ్ చేస్తుండడంతో వాహన చోదకులు, పాదచారులు నరక యాతన పడుతున్నారు.

- అనధికార పార్కింగ్‌లతో అవస్థలు
- చీకటి పడితే మరిన్ని ఇబ్బందులు
- ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిపై పద్మవ్యూహాన్ని తలపిస్తున్న ట్రాఫిక్



నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో పద్మవ్యూహాన్ని తలపిస్తున్న ట్రాఫిక్



జ్ఞానాపురం వెళ్లే దారిలో వాహనాల బారు

కంచరపాలెం: తాటిచెట్లపాలెం కూడలి నుంచి కంచరపాలెం.. కంచరపాలెం నుంచి నేతాజీ ఫ్లైఓవర్ వంతెన.. జ్ఞానాపురం వెళ్లే రహదారుల్లో ఇష్టమొచ్చినట్లు వాహనాలు నిలుపుతుండడంతో రాకపోకలకు వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్లపై రెండేసి వరుసల్లో వాహనాలు నిలిపి చాలా మంది డ్రైవర్లు వాటికి మరమ్మతులు చేసుకోవటం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అలాగే ఈ దారుల్లో నెలల తరబడి వాహనాలు నిలిపి ఉంచటం వల్ల చెత్త, మట్టి గుట్టలుగా పేరుకుపోతోంది. వాహనాలు అడ్డుగా నిలిపి ఉంచడం వల్ల పారిశుధ్య సిబ్బంది విధులకు ఆటంకంగా మారడంతో ఈ ప్రాంతంలో చెత్త పేరుకుపోయి అపారిశుధ్యం పేరుకుపోతోంది. అలాగే ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని చిరువ్యాపారులు లావాదేవీలు సాగించడం వల్ల కూడా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

రహదారికి ఇరువైపులా..

కంచరపాలెం నుంచి ఎన్ఏడీ కొత్తరోడ్డుకు వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారిపై వాహనాలు నిలిపేస్తున్న కారణంగా కొన్నిసార్లు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. కంచరపాలెం ఫ్లైఓవర్ మార్గంలో ఎఫ్‌సీఐ గిడ్డంగికి వచ్చే లారీలు ఎక్కడ పడితే అక్కడ నిలుపుతుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహన చోదకులు, పాదచారులు కోరుతున్నారు.



కంచరపాలెం వెళ్లే దారిలో వాహనాలకు మరమ్మతులు..

హెచ్చరిక బోర్డుల వద్దే పార్కింగ్..

జీవీఎంసీ జోన్–5 టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలు పార్కింగ్ చేస్తే జరిమానా వసూలు చేస్తామని అందులో రాశారు. కొందరు ఆయా హెచ్చరికలను నిర్లక్ష్యం చేయటమే కాకుండా.. ఆ బోర్డుల వద్దే ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. నిత్యం నిబంధనలు ఉల్లంఘిస్తున్నా ట్రాఫిక్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. కంచరపాలెం కూడలి గ్రామాభ్యుదయ సంఘం వ్యాపార భవనం వద్ద పార్కింగ్ మరీ దారుణంగా ఉంటుంది. హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించడంలో ట్రాఫిక్ పోలీసులకు ఉన్న శ్రద్ధ రహదారిపై ఆక్రమణలను తొలగించడంలో లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బీఆర్‌టీఎస్‌లో అనధికార పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఇండస్ట్రియల్ ఎస్టేట్ బీఆర్‌టీఎస్ రహదారిలో అక్రమ పార్కింగ్

ప్రయాణం నరకం..

కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలెం మీదుగా ప్రయాణించాలంటే నరకం చూడాల్సి వస్తోంది. నిత్యం భారీ వాహనాలు రహదారికి ఇరువైపులా నిలపడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

–కొరివాడ పైడిరాజు, దుర్గానగర్, కంచరపాలెం.

వాహనాలు తరలించాలి..

రహదారికి ఇరువైపులా ఏళ్ల తరబడి నిలిపి ఉంచిన వాహనాలను తరలిస్తే అటుగా ప్రయాణం చేసే వారికి ఇబ్బందులు ఉండవు. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి రహదారిపై నిలిచిపోయిన వాహనాలను తరలించాలి.

–పి.సునీల్‌కుమార్, జ్ఞానాపురం.

నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యం

గడప గడపకు కార్యక్రమంలో నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు



సంక్షేమ ఫలాల కరపత్రాలు అందిస్తున్న కేకే రాజు, వావిలపల్లి ప్రసాద్

మద్రిపాలెం: నాణ్యమైన సేవలు అందించడమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ లక్ష్యమని ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె. రాజు అన్నారు. మంగళవారం 50వ వార్డు 288 సచివాలయం పరిధి వంశీనగర్‌లో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ ఫలాలను వివరించారు. సమస్యల ఆరా తీశారు. ఈ సందర్భంగా కె.కె. రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మంచి చేయాలనే దృఢ సంకల్పంతో మొత్తం సమయాన్ని రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి వెచ్చిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షురాలు పప్పల సునీత, డైరెక్టర్లు పైడిశ్రీను, ప్రసూనారెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, 50వ వార్డు నాయకులు భగాతి విజయ్, పైడి కృష్ణారావు మాస్టర్, సనపల నారాయణస్వామి, ఏపీఎస్ రాజు, ఎస్.శ్రీను, పొన్నాడ అప్పారావు మాస్టర్, ఎం.లక్ష్మి, పాతపట్నం రామ్మోహన్, రాంబాబు, శివరాం, త్రినాథ్, చిరంజీవి, కంచరాన రాజేశ్వరరావు, సీనియర్ నాయకులు పైడి ప్రతాప్, షేక్‌బాబ్జి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కేకే రాజుకు సత్కారం



కేకే రాజును సత్కరిస్తున్న ఎన్‌జీజీవోస్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు

మురళీనగర్: ఎన్‌జీజీవోస్ కాలనీలో నూతనంగా ఎన్నికైన వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సత్కరించారు. కాలనీలో సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కేకే రాజు సానుకూలంగా స్పందించారు. కేకే రాజును కలిసినవారిలో కాలనీ అధ్యక్షుడు వి.పార్వతీశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి.బలరామస్వామి, కార్యదర్శి కె.రామచంద్రరాజు, డైరెక్టర్లు ఎన్.సాంబశివరావు, కె.వివేక్ స్వరూప్, రాజారావు, పి.శ్రీనివాసరావు ఉన్నారు.

కూలిన చెట్టు.. పట్టించుకోని అధికారులు



సీతమ్మధార నుంచి అల్లూరి విగ్రహానికి వెళ్లే దారిలో కూలిన చెట్టు

సీతమ్మధార: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మంగళవారం ఉదయం సీతమ్మధార ప్రధాన రహదారిలోని ఆర్ అండ్ బి రోడ్డులో రెండు చెట్లు కూలిపోయాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా వాహనాల రాకపోకలకు వీలు లేకుండా పోయింది. జీవీఎంసీ 24వ వార్డులోని ప్రధాన రహదారిలో ఈ ఘటన చోటు చేసుకుంది. రోడ్డు మధ్యలో చెట్టు కూలిపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. జీవీఎంసీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని చుట్టుపక్కల వారు, వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చెట్టును తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

సకల కళాకారుల సంఘం ఎన్నికలకు నామినేషన్లు



నామినేషన్ అందజేస్తున్న రచయిత్రి జాలాది విజయ

సీతంపేట: విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘానికి ఈ నెల 30వ తేదీన జరగనున్న ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం మంగళవారం స్థానిక పౌర గ్రంథాలయంలో జరిగింది. అధ్యక్ష స్థానానికి రచయిత్రులు డాక్టర్ జాలాది విజయ, చెక్కా రమాదేవి, ఉపాధ్య స్థానానికి ఎం. త్రినాథరావు, పీఏ భాస్కరరావు, కార్యదర్శి స్థానానికి కె.లోకేష్, సహాయ కార్యదర్శి స్థానానికి గెంబలి జగదీష్, కోశాధికారి స్థానానికి మదుపాడ రమణి, బూడిద లక్ష్మి స్వరూప నామినేషన్లు వేశారు. ఎన్నికల అధికారులుగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, గాయకులు జామి శివ అప్పలరాజు వ్యవహరించారు. ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ చెన్నా తిరుమలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'మణిపూర్‌లో చిచ్చుకు బీజేపీయే కారణం'



సంఘీభావం తెలుపుతున్న వివిధ రాజకీయ పార్టీల నేతలు

సీతంపేట: మణిపూర్‌లో రెండు నెలలకు పైగా జరుగుతున్న హింసాకాండను అక్కడి బీజేపీ ప్రభుత్వమే నడిపిస్తుందని పలు రాజకీయ పార్టీల నేతలు ఆరోపించారు. సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో మణిపూర్ ఘటనపై జరిగిన చర్చా గోష్ఠిలో టీడీపీ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, లోక్‌సత్తా, మహిళా సమాఖ్య నాయకులు పాల్గొన్నారు. సీపీఐ విశాఖజిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్నది మత హింస, కేవలం రెండు మతాల మధ్య జరుగుతున్న పోరాటం కాదని, భూమి, వనరుల వంటి ప్రధాన అంశాలు ఇమిడి ఉన్నాయన్నారు. ఇందులో మత మౌఢ్యులు, మిలిటెంట్లు పాల్గొంటున్నాయని ఆరోపించారు. అధికారంలో ఉన్న బీజేపీ ఫాసిస్టు ప్రభుత్వం తవ రహస్య కార్పొరేట్ అజెండా నెరవేరేలా తెలివిగా వ్యూహాలు రచించి అమలు చెయ్యడమే నేటి సంక్షోభానికి దారి తీసిందని ఆవేదన వ్యక్తం చేసారు. ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ రాజీనామా చెయ్యాలని, సుప్రీంకోర్టు అజమాయిషీలో విచారణ జరిపించి బాధితులకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్, సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి వై. కొండయ్య, ఎంసీపీఐయూ జిల్లా నాయకుడు కె.శంకరరావు, ప్రజాపోరు నాయకుడు కె.దేవా, భారత్ బచావో నాయకుడు శ్రీనివాస్, ఆప్ పార్టీ జిల్లా కన్వీనర్ ఇ.చంద్రశేఖర్ లోక్‌సత్తా నాయకుడు ఎంఎస్ఎన్ మూర్తి, మహిళా సమాఖ్య నాయకులు ఎ. విమల తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

శ్రీలలితా లహరి సప్తాహ ప్రవచనం



భక్తులనుద్దేశించి ప్రవచిస్తున్న మాతా రమ్యానందభారతి స్వామిని

సీతంపేట: అక్కయ్యపాలెం లలితాపీఠంలో జరుగుతున్న శ్రీలలితా లహరి సప్తాహ ప్రవచన కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శ్రీశక్తిపీఠాధీశ్వరి మాతాజీ రమ్యానందభారతి స్వామిని ప్రవచనం కొనసాగింది. ఈ సందర్భంగా జగన్మాత అయిన లలితాదేవి లీలా మహత్యం, ఉపాసన విధానాలు, మంత్ర రహసాలు, శ్రీయంత్ర విశేషాలతో కూడిన విషయాల గురించి ప్రవచించారు. శ్రీలలితా సహస్ర నామాల ఆవిర్భావం గురించి వివరిస్తూ ప్రతి రోజూ లలితా సహస్ర నామ పారాయణ చదివినా, విన్నా సకల శుభములు చేకూరుతాయని, పరిపూర్ణ జ్ఞానం చేకూరుతుందని తెలిపారు. లలితాపీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మహా స్వామి సమక్షంలో జరిగిన ప్రవచన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆటోలకు గ్యాస్ అందుబాటులోకి తేవాలి



బాబా ఆలయం స్టాండ్ వద్ద నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు

సీతమ్మధార: విశాఖ జిల్లాలోని సీఎన్జీ ఆటోలకు గ్యాస్ అందుబాటులోకి తీసుకురావాలని, అన్ని ప్రాంతాల్లో బంకులు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ అన్నారు. మంగళవారం సీతమ్మధార షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద సీఎన్జీ ఆటో డ్రైవర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ ఆటోలపై ప్రైవేట్ ఫైనాన్షియర్ల దోపిడీని అరికట్టాలన్నారు. నగరంలో తిరుగుతున్న ఆటోలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని, ఈ చలానాల విధింపు ఆపాలన్నారు. ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఎన్జీ ఆటోస్టాండ్ ప్రెసిడెంట్ సారిపల్లి ప్రసాద్, ఎస్‌కే బాషా, శంకరరావు, రమణ, శ్రీనివాసరావు, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై రెండు టన్నుల టమాటాల విక్రయం



నరసింహనగర్ రైతు బజార్‌లో సబ్సిడీ టమాటా కోసం బారులు తీరిన జనం



సీతమ్మధార రైతుబజారులో టమాటా కోసం క్యూలో నిల్చున్న వినియోగదారులు

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో కిలో రూ.50 చొప్పున రెండు టన్నుల టమాటాలు సబ్సిడీపై విక్రయించారు. టమాటా ధర నియంత్రణకు ప్రభుత్వం సబ్సిడీపై రైతుబజార్లలో వీటిని విక్రయిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.120 నుంచి 130 వరకు విక్రయిస్తున్నారు. ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా టమాటాలు కొనుగోలు చేసి సబ్సిడీపై ప్రజలకు అందిస్తోంది. మంగళవారం కూడా నగరంలోని అన్ని రైతుబజార్లలో సబ్సిడీ టమాటాలు విక్రయించారు. నరసింహనగర్ రైతుబజార్‌కు 80 క్రేట్లు (రెండువేల కిలోలు) టమాటా వచ్చినట్లు ఎస్టేట్ ఆఫీసర్ చినబాబు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేసి టమాటాలు విక్రయించారు. సబ్సిడీ టమాటాల కోసం వినియోగదారులు తెల్లవారుజాము నుంచే క్యూలు కట్టారు. క్యూలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆధార్ లేదా రేషన్ కార్డుపై కిలో చొప్పున విక్రయించారు. ఉదయం 8.30 గంటలకే రెండు వేల కిలోల టమాటా విక్రయించేసారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల పట్ల వినియోగదారులు, ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీతమ్మధార రైతుబజారులో..

సీతమ్మధార: సబ్సిడీ టమాటా కోసం సీతమ్మధార రైతుబజారులో వినియోగదారులు బారులు తీరారు. కిలో టమాటా రూ.50కు మంగళవారం విక్రయించారు. ఉదయం నుంచి వినియోగదారులు టమాటా కోసం క్యూ కట్టారు. ఆధార్, రేషన్ కార్డుకు కిలో టమాటా రూ.50కి విక్రయించారు. మొత్తం మంగళవారం 109 క్రేట్ల టమాటా విక్రయించినట్లు స్టేట్ అధికారి కొండబాబు తెలిపారు.

లలితా పీఠానికి పోటెత్తిన భక్తులు



లలితా పీఠాధిపతిని దర్శించుకుంటున్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెంలో గల లలితాపీఠానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి వారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. జూలై 3వ తేదీ నుంచి సెప్టెంబరు 29 వరకు చాతుర్మాస దీక్షలు జరగనుండటంతో స్వామీజీ లలితాపీఠంలో భక్తులకు అందుబాటులో ఉంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులను దర్బారు హాల్లో కూర్చోబెట్టి ఒకరి తర్వాత మరొకరిని దర్శనానికి అనుమతిస్తున్నారు. అలాగే పలువురు భక్తులు తమ సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు మంత్రోపదేశం తీసుకుంటున్నారు. పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. స్వామీజీని కలవడానికి ముందుగా అనుమతి తీసుకోవాలని తెలిపారు.

రహదారులు జలమయం



సీతంపేట మెయిన్‌రోడ్డులో కురుస్తున్న వర్షం



ఐదవ పట్టణ పోలీసు స్టేషన్ ప్రాంతంలో..

సీతంపేట: నగరంలో వరుసగా మూడవ రోజు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ, సాయంత్రం అయ్యే సరికి భారీ వర్షం కురుస్తోంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం, మూడవ రోజు మంగళవారం కూడా అదే తీరుగా కొనసాగింది. ఈ సీజన్‌లో వరుసగా మూడు రోజులపాటు వర్షం కురవడం ఇదే తొలిసారి. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయం అయ్యాయి. వాహన చోదకులు, పాదచారులు, సాయంత్రం కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రతి రోజూ వర్షం కురవడంతో వ్యాపారాలు సాగడం లేదని చిరు వ్యాపారులు ఉసూరుమంటున్నారు.

భారీ వర్షం..

మురళీనగర్: మురళీనగర్ పరిసరాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయమంతా విపరీతమైన ఎండ కాసింది. దీంతో జనం ఉక్కపోతకు గురయ్యారు. అయితే సాయంతం 7 గంటల నుంచి 8.30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో జనం వర్షంలో తడిసిముద్దయ్యారు. భారీ వర్షానికి రహదారులన్నీ జలమయం అయ్యాయి. గంటన్నర పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ఆఫీసులు, పాఠశాలల నుంచి ఇంటికి చేరుకునే వారు ఇబ్బంది పడ్డారు. వర్షానికి వాతావరణం చల్లబడడంతో వేడిమి నుంచి ఉపశమనం లభించింది.

మురుగు నీటితో ఇక్కట్లు

పట్టించుకోని అధికారులు



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని బాలయ్యశాస్త్రి లేఅవుట్, అభయాంజనేయస్వామి ఆలయం రోడ్డులో మ్యాన్‌హోల్ పొంగి మురుగునీరు రోడ్లపై పారుతుండటంతో దుర్వాసన వ్యాపించింది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో తరచూ ఇలా జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కనిపించటం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇంత జరిగినా సంఘటనా స్థలం వద్దకు ఒక్క శానిటరీ ఇన్‌స్పెక్టర్ కూడా రాలేదని చుట్టుపక్కల వారు ఆరోపిస్తున్నారు. రెండు రోజులుగా ఇదే పరిస్థితిలో ఉన్నామని వారంటున్నారు. తక్షణం జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అలాగే 24వ వార్డు టీపీటీ కాలనీలోని మ్యాన్‌హోల్ కూడా పొంగి మురుగునీరు బయటికి రావడంతో చుట్టుపక్కల ప్రాంతమంతా దుర్వాసన వ్యాపించింది. వార్డుల్లో ప్రతి రోజు ఏదో ఒకచోట మ్యాన్‌హోల్ పొంగి దుర్వాసన వ్యాపిస్తుందని ఆయా ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇందిరాగాంధీ ఉద్యానవనానికి మహర్దశ

రూ.8 లక్షలతో పార్కు అభివృద్ధి పనులు



నక్కవానిపాలెంలో ఇందిరాగాంధీ ఉద్యానవనం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఇందిరాగాంధీ ఉద్యానవనం (పార్కు) మరమ్మతు పనులకు ఎట్టకేలకు జీవీఎంసీ రూ.8 లక్షల నిధులు విడుదల చేసింది. గత కొన్నేళ్లుగా పర్యవేక్షణ లేక పార్కులోని వస్తువులు తుప్పుపట్టి పాడైపోయాయి. 1985లో నక్క రామకృష్ణారెడ్డి కౌన్సిలర్‌గా ఉన్నప్పుడు ఈ పార్కు నిర్మాణం చేపట్టారు. 1993లో అప్పటి రాజ్యసభ సభ్యులు ద్రోణంరాజు సత్యనారాయణ, మంత్రి బలిరెడ్డి సత్యారావు ఇందిరాగాంధీ విగ్రహ కమిటీ అధ్యక్షుడు నక్క రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పార్కుకు పర్యవేక్షణ లేక స్థానికులు సాయంత్రం వేళల్లో కూర్చోడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. వారం రోజుల క్రితం స్థానిక కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె. రాజు ఆధ్వర్యంలో మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. దీంతో మరికొద్ది రోజుల్లో పార్కు పూర్వ వైభవం సంతరించుకోనుందని కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి తెలిపారు.